

వికారాబాద్ : యోగాసనాలు వేస్తున్న స్పీకర్, కలెక్టర్, ఎస్పీ తదితరులు

యోగా.. ఒక జీవన విధానం

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్
- వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో, కన్హా శాంతివనంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం
- పాల్గొన్న కేంద్రమంత్రి వీరేంద్ర కుమార్, వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి

నందిగామ : కన్హాలో యోగా చేస్తున్న కేంద్ర మంత్రి వీరేంద్రకుమార్

వికారాబాద్, జూన్ 21 : యోగా అనేది శారీరక వ్యాయామమే కాదు, ఒక జీవన విధానమని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా వికారాబాద్‌లోని బ్లాక్ గ్రౌండ్‌లో జరిగిన యోగా డే కార్యక్రమంలో కలెక్టర్ కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, విద్యార్థులతో కలిసి స్పీకర్ ఆసనాలు వేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా వల్ల కలిగే శారీరక, మానసిక, ఆధ్యాత్మిక, ఆరోగ్య ప్రయోజనాల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆచరించాలన్నారు. యోగాను నిత్యం సాధన చేయడం ద్వారా మనిషిలో ఒత్తిడి, ఆందోళనను తగ్గించి మానసికంగా, ప్రశాంతంగా ఉండవచ్చని.. శారీరకంగా కూడా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. భారతదేశంలో 2500 సంవత్సరాల క్రితం పతంజలి మహర్షి ద్వారా యోగా వెలుగులోకి వచ్చిందన్నారు. యోగాను అన్ని వయసుల వారు చేయవచ్చని, సొంతంగా కంటే గురువుల మార్గదర్శకంలో చేస్తే ఎక్కువ ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, డీఎస్పీ శ్రీనివాస్, యువజన క్రీడల అభివృద్ధి అధికారి ఇన్‌చార్జి మహమ్మద్ అబ్దుల్ సత్తార్, ఎల్‌డీఎం యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

3200 మంది దివ్యాంగులు పాల్గొనడం స్ఫూర్తిదాయకం

నందిగామ : యోగ శాశ్వత సాధనంగా మార్చుకుని జీవన విధానాన్ని మెరుగుపరుచుకోవాలని కేంద్ర సామాజిక న్యాయ సాధికారత మంత్రి వీరేంద్ర కుమార్ తెలిపారు. నందిగామ మండలం కన్హా శాంతివనంలో జరిగిన యోగా దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. యోగా ప్రపంచానికి భారత దేశం ఇచ్చిన బహుమతి అని.. ప్రపంచ ఐక్యత, శాంతి భారతదేశం యొక్క సందేశమని తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ దార్శనిక నాయకత్వంలో యోగా అంతర్జాతీయంగా అన్ని రూపాల్లో వైవిధ్యాన్ని స్వీకరించే ప్రపంచ ఉద్యమంగా మారిందన్నారు. యోగా ద్వారా మనసుకు ప్రశాంతతతోపాటు శారీరక దృఢత్వం లభిస్తుందని తెలిపారు. యోగా కేవలం ఒక అభ్యాసంగా కాకుండా మన జీవితాల్లో అంతర్భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా కార్యక్రమంలో భారీ సంఖ్యలో దివ్యాంగుల భాగస్వామ్యంతో చరిత్ర సృష్టిస్తున్నామని.. దేశంలోని 25 రాష్ట్రాల నుంచి 3200 మంది దివ్యాంగులు పాల్గొనడం అందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో 25 రాష్ట్రాల నుంచి 3200 మందికి పైగా దివ్యాంగులు, వివిధ రాష్ట్రాల ప్రతినిధులున్నారు.

ప్రాసీడింగ్స్ అందజేత

బంట్వారం : వికారాబాద్ నియోజకవర్గానికి 7వేల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం జరుగుతుందని స్పీకర్ పేర్కొన్నారు. బంట్వారం, కోట్‌పల్లి మండలాల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ బంట్వారం, కోట్‌పల్లి మండలాల అధ్యక్షులు వెంకటేశ్, నర్సింగ్, ఎంపీడీవోలు రాములు, డేనియల్, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

నందిగామ : యోగా చేస్తున్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు, దివ్యాంగులు

శాస్త్రీయ విధానంలో డెయిరీ సాగుతో అధిక లాభాలు

పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ కిషన్‌కుమార్

శిక్షణా కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కిషన్‌కుమార్

షాబాద్, జూన్ 21 : శాస్త్రీయ పద్ధతుల ద్వారా డెయిరీ సాగు చేపడితే అధిక లాభాలు పొందే అవకాశం ఉందని పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ కిషన్‌కుమార్ అన్నారు. షాబాద్ మండలంలోని మల్లారెడ్డిగూడ గ్రామంలో శనివారం పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్, సేవా స్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శాస్త్రీయ డెయిరీ సాగు, పాల ఉత్పత్తుల విలువ జోడింపుపై పాడి రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రీయ పద్ధతుల ఆధారంగా ఆధునిక డెయిరీ ఫారాలను స్థాపన, పశుపోషణ, ఆవుల గదుల నిర్మాణం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు పొందే విధానాలు వంటి అంశాలపై వివరించారు.

లైవ్ స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ డాక్టర్ కొండల్‌రెడ్డి శిక్షణా కార్యక్రమాల ఫలితాలపై సమీక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో సులభంగా చేయగల మజ్జిగ, నెయ్యి, క్రీమ్ తయారీపై ప్రాక్టికల్ డెమో ఇచ్చారు. ప్రొఫెసర్ విభాగాధిపతి డాక్టర్ శశికుమార్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సాహిత్యరాణి లైవ్ స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ విభాగం వారు కోవా, కలాకండ్, పన్నీర్, చెన్న, రసగుల్లా, రస మలై, మజ్జిగ, లస్సి, లేబర్ మిల్క్, వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై వర్క్ షాపులు నిర్వహించారు. పరిశుభ్రత నాణ్యతా ప్రమాణాలు, మార్కెటింగ్ అవకాశాల ప్రాముఖ్యతపై వివరించారు. సేవ స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ గొల్లపల్లి రత్నాకర్ డెయిరీ రంగంలో గ్రామీణ మహిళల సాధికారత అనే అంశంపై ప్రేరణాత్మక ప్రసంగం అందించారు. పాల ఉత్పత్తి, పశుపోషణ వంటి కార్యకలాపాల్లో మహిళల పాత్రను కొనియాడుతూ శాస్త్రీయ పద్ధతులు ప్రభుత్వ పథకాల వినియోగం వ్యాపార నైపుణ్యాల సాధన ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు.

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. పశువుల ఆరోగ్య సంరక్షణపై రైతులు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. టీకాలు, వ్యాధుల నియంత్రణ చర్యలపై వివరించారు. పశు ఆరోగ్యం మెరుగుపడితే పాల ఉత్పత్తి కూడా పెరుగుతుందని చెప్పారు. అనంతరం మహిళా పాడి రైతులకు శిక్షణా ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. రైతుల్లో కొత్త ఆవిష్కరణల పట్ల ఆసక్తిని కలిగించి, శాస్త్రీయ డెయిరీ సాగు ద్వారా ఆదాయం పెంచే దిశగా ఒక మంచి మార్గాన్ని చూపిందని.. ముఖ్యంగా, మహిళల ఆర్థిక సాధికారతకు ఇది ప్రేరణగా నిలిచిందని తెలిపారు.

టౌన్ ప్లానింగ్ అధికారులకు స్థానచలనం

సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ): జీహెచ్‌ఎంసీలో 27 మంది టౌన్ ప్లానింగ్ అధికారులను బదిలీ చేస్తూ బల్దియా కమిషనర్ ఆర్వీ కర్ణన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పలువురు అధికారులపై అవినీతి ఆరోపణలు రావడంతో కమిషనర్ టౌన్ ప్లానింగ్ సెక్షన్‌ను ప్రక్షాళన చేస్తున్నారు. ఇటీవల కొంతమంది అధికారులు ఏసీబీకి పట్టుబడటంతో వారి స్థానచలనంపై కమిషనర్ ఫోకస్ చేశారు. అదేవిధంగా జీహెచ్ ఎంసీ ప్రజావాణిలోనూ అధికారులపై అవినీతి ఆరోపణలు వచ్చాయి. దీంతో ప్రస్తుతం ఉన్న ఖాళీల భర్తీతో పాటు అధికారుల పనితీరు ఆధారంగా బదిలీలు చేపట్టారు. బల్దియాలో సెక్షన్ ఆఫీసర్లుగా కొంతమందికి ఏసీపీలుగా పదోన్నతి కల్పిస్తూ పోస్టింగ్‌లు ఇచ్చారు. అందులో భాగంగానే వివిధ మున్సిపాలిటీల నుంచి వచ్చిన ఏడుగురు అధికారులకు సర్కిల్ ఏసీపీలుగా పోస్టింగ్‌లు ఇచ్చారు. వారందరికీ వ్యక్తిగతంగా ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు జారీ చేశారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

వికారాబాద్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఎ సెక్రటరీ వెంకటేశ్వర్లు

పరిగి, జూన్ 21 : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వికారాబాద్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఎ సెక్రటరీ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం అంకిత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పరిగి లోని మండల పరిషత్ సమావేశపు హాలులో నిర్వహించిన న్యాయ అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. బాల్య వివాహాలు చేయరాదన్నారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే వెంటనే పోలీసులకు సమాచారమందించాలని సూచించారు. వరకట్న వేధింపుల చట్టంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. ఉపాధి హామీ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు తమకు సంబంధించిన చట్టాలపై అవగాహన ఏర్పరచుకోవాలని సూచించారు. కార్యక్రమం ఏర్పాటు చేసిన అంకిత స్వచ్ఛంద సంస్థను జడ్జి అభినందించారు. అనంతరం లేబర్ కార్డు ద్వారా లేబర్ ట్రైనింగ్ పొందిన కార్మికులకు నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో పరిగి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శిల్ప, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ అడ్వకేట్లు, అంకిత స్వచ్ఛంద సంస్థ స్టేట్ కో ఆర్డినేటర్ డానియేల్, వికారాబాద్ జిల్లా కో ఆర్డినేటర్ ప్రకాశ్‌కుమార్, సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలి

ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి

ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్యలపై సర్వే చేస్తున్న ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణ జ్యోతి, సీఐటీయూ నాయకులు

వికారాబాద్, జూన్ 21 : ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల ఆపరేషన్లకు సరిపడు పరికరాలు అందుబాటులో ఉంచాలని ఐద్వా మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి తెలిపారు. శనివారం అఖిల భారత మహిళా సంఘం ఐద్వా, సీఐటీయూ యూనియన్ ఆధ్వర్యంలో వికారాబాద్ ప్రభుత్వ దవాఖానలో సమస్యలపై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వికారాబాద్‌లో ఉన్న నూతన ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పేషంట్లకు కనీస వసతులు కల్పించాలని, సీజనల్ వ్యాధులకు చెందిన అన్నిరకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఓపీ పేషంట్లు రోజుకు 200 వరకు వస్తున్నారని, వీరికి తాగునీరు, విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలన్నారు. కళాశాల, దవాఖానలో అన్ని రకాల ఆపరేషన్ పరికరాలు, సీటీ, ఎంఆర్ఐ స్కానింగుల సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రభుత్వం ఉచిత 5 అంబులెన్సులు ఏర్పాటు చేయాలని, కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న 3 నెలల జీతాలివ్వాలని, ఏడాదికి 4 జతల యూనిఫాంలు, బూట్లు వెంటనే ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న బిల్డింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా మహిళా సంఘం జిల్లా కార్యదర్శి అనసూయ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్, నాయకులు పాల్గొన్నారు.

డిస్ట్రిక్ట్ డ్యూటీ మీట్ విజయవంతం

వికారాబాద్, జూన్ 21 : జిల్లా పోలీస్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ డ్యూటీ మీట్ విజయవంతం చేసినట్లు ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో డిస్ట్రిక్ట్ డ్యూటీ మీట్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోలీస్ అధికారులు, సిబ్బందికి మార్గనిర్దేశం చేశారు. ఈ మీట్‌లో వివిధ విభాగాల్లో పోలీస్ సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపరచడానికి, వారి ప్రతిభను ప్రదర్శించడానికి పలు పోటీలను నిర్వహించారు. 1)పరిశోధనకు శాస్త్రీయ సహాయాలు, 2)విధ్వంస నిరోధక తనిఖీ, 3)డాగ్ స్క్వాడ్ పోటీ, 4)కంప్యూటర్‌పై అవగాహన, 5)ఫొటోగ్రఫీ, 6)వీడియోగ్రఫీ పోటీలను పర్యవేక్షించారు. ఈ పోటీల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది అత్యంత ఉత్సాహంగా, చురుకుగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. డిస్ట్రిక్ట్ డ్యూటీ మీట్ అనేది పోలీస్ శాఖలో సిబ్బందికి కేవలం ఒక పరీక్ష కాదు.. ఇది వారి నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి, కొత్త టెక్నాలజీలను నేర్చుకోవడానికి, అత్యుత్తమ సేవలందించి ప్రజల విశ్వాసాన్ని చూరగొనడానికి ఒక సమగ్ర వేదిక అని పేర్కొన్నారు. ఇది పోలీస్ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచి, శాంతిభద్రతల పరిరక్షణలో మరింత పటిష్టంగా పనిచేయడానికి దోహదపడుతుందని తెలిపారు. భవిష్యత్తులో జరిగే అన్ని స్థాయి పరీక్షల్లో కూడా అదే స్ఫూర్తితో పాల్గొని, తమ అద్భుతమైన ప్రతిభతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఈ డిస్ట్రిక్ట్ డ్యూటీ మీట్‌లో యూనిట్ స్థాయిలో ఎంపికైన విజేతలు తదుపరి జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని, ఈ జోనల్ స్థాయి పోటీలు జులై నెలలో సంగారెడ్డిలో నిర్వహించబడతాయని తెలిపారు. జోనల్ స్థాయిలో అర్హత సాధించిన వారిని రాష్ట్ర స్థాయి డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామన్నారు. రాష్ట్ర 2వ డ్యూటీ మీట్ వరంగల్‌లో జరుగుతుందని తెలిపారు. చివరగా, రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచినవారు మహారాష్ట్రలో నిర్వహించబడే 69వ ఆల్ ఇండియా పోలీస్ డ్యూటీ మీట్ 2025-2026లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ జానయ్య, ఏఆర్‌డీ ఎస్పీ వీరేశ్, సీఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

వసతి గృహాల పరిశీలన

మర్పల్లి, జూన్ 21 : విద్యార్థులకు మెనూ ప్రకారం నిత్యం వేడి, రుచికరమైన భోజనం అందించాలని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా షెడ్యూలు కులాల అధికారి కమలాకర్‌రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంతోపాటు సిరిపురం ఎస్సీ బాలర వసతి గృహాన్ని సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా హాస్టల్ గదులతోపాటు కిచెన్ షెడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పారిశుధ్యం లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఆయన వెంట సిరిపురం హాస్టల్ వార్డెన్ తుల్జారాంగౌడ్ ఉన్నారు.

మర్పల్లి బాలికల వసతి గృహాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి కమలాకర్‌రెడ్డి

అడ్మినిస్ట్రేటివ్ అఫ్ జస్టిస్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 21 : 2025-26 సంవత్సరం అడ్మినిస్ట్రేటివ్ అఫ్ జస్టిస్‌లో శిక్షణ పొందుటకు వికారాబాద్ జిల్లాకు చెందిన బీసీ కులాలకు చెందిన లా గ్రాడ్యుయేట్ల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏ ఫ్యాకల్టీలో అయిన బేసిక్ డిగ్రీ హోల్డర్, భారతదేశంలో కేంద్ర చట్టం, ప్రొవెన్షియల్ చట్టం లేదా రాష్ట్ర చట్టం కింద స్థాపించబడిన లేదా చేర్చబడిన విశ్వవిద్యాలయం, కేంద్ర విద్యాలయం, గ్రాంట్స్ కమిషన్ గుర్తించిన విద్యా సంస్థల నుంచి లా కోర్స్‌లో డిగ్రీ పొంది ఉండాలన్నారు. జూలై 2025 నాటికి 23 సం. నిండి 35 సంవత్సరాల లోపుండాలన్నారు. అభ్యర్థి తల్లిదండ్రుల/సంరక్షకుల ఆదాయం గ్రామీణ ప్రాంతం వారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతం వారికి రూ.2,00,000లకు మించరాదు. అభ్యర్థి గతంలో ఇటువంటి సౌకర్యం వినియోగించుకొని ఉండరాదని తెలిపారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకొని ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు మూడు సంవత్సరాలు అడ్మినిస్ట్రేటివ్ ఆఫ్ జస్టిస్‌లో శిక్షణ పొందాలని, ఈ మూడు సంవత్సరాలకు ఆర్థిక సాయం కల్పించబడుతుందన్నారు. శిక్షణ కాలంలో నెలకు రూ.1000 చొప్పున స్టైఫండ్, అడ్వకేట్‌గా ఎన్‌రోల్‌మెంట్ ఫీజు రూ.585, లా పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.3000 చెల్లించబడును. ఎంపికైన అభ్యర్థులు (4) శిక్షణ కోసం జిల్లా న్యాయస్థానంలోని ప్రభుత్వ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యుటు కు అనుబంధం చేయడం జరుగుతుందని తెలిపారు. అభ్యర్థులు నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తు చేయవలెను. దరఖాస్తులను జిల్లా బీసీ అభివృద్ధి అధికారి, వికారాబాద్ జిల్లా కార్యాలయంలో జూన్ 23 నుంచి పొందవచ్చని పేర్కొన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులతోపాటు అభ్యర్థి పాస్‌పోర్ట్ ఫొటో, ఆధార్ కార్డు జిరాక్స్, స్థానిక, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, లా డిగ్రీ, డిగ్రీ ప్రొవిజినల్, బార్ కౌన్సిల్ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాలను జులై 7 లోగా జిల్లా బీసీ అభివృద్ధి అధికారికి అందజేయాలని తెలిపారు.

సమగ్ర విచారణ జరిపించాలి

వికారాబాద్, జూన్ 21 : వికారాబాద్‌లో 4 రోజుల నుంచి హాట్ టాపిక్‌గా మారిన డాక్టర్ కారులో గంజాయి వార్త శనివారం స్పీకర్ ప్రసాద్‌కుమార్ వద్దకు చేరింది. డాక్టర్ కారులో గంజాయి దొరికిందని.. పోలీసులు డాక్టర్ సందీప్‌గౌడ్‌ను గంజాయి కేసులో ఇరికించారని ఆరోపిస్తున్నారు. ఇదిలాఉండగా స్పీకర్‌ను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు కలిశారు. గంజాయి కేసు విషయంలో పూర్తి విచారణ జరిపేలా చూడాలని స్పీకర్‌ను కోరారు. డాక్టర్లపై పోలీసుల దౌర్జన్యాలు పెరిగిపోతున్నాయని వారు స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పీకర్‌ను కలిసినవారిలో ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు సాధు సత్యానంద్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు నాగేందర్‌గౌడ్, డాక్టర్ శాంతప్ప ఉన్నారు.

ఏజీయూలో విద్యార్థుల ఆందోళన

వ్యవసాయ యూనివర్సిటీ జూన్ 20: రెండు దశాబ్దాలుగా స్కాలర్‌షిప్ పెంచకుండా, అదనపు భారాన్ని వేస్తూ కాలయాపన చేస్తున్నారని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థులు శనివారం అడ్మినిస్ట్రేషన్ భవనాన్ని ముట్టడించారు. ఫీజులు మాత్రం సంవత్సరానికి 10 శాతం పెంచుతూ విద్యార్థులపై ఆర్థిక భారాన్ని మోపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన పరిశోధనలు చేపట్టాలని విద్యార్థులకు ఆదేశాలు జారీ చేస్తూ దానికి అవసరమైన ఆర్థిక అవసరాలను మాత్రం తీర్చడం లేదని మండిపడ్డారు. నాణ్యమైన పరిశోధనలకు విద్యార్థులకు ఎటువంటి ఆర్థిక భారం కలగకుండా వర్సిటీ విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పది రోజులుగా పీహెచ్‌డీ విద్యార్థులు రెండో సెమిస్టర్ రిజిస్ట్రేషన్ ను నిలిపి వేశారు. స్కాలర్‌షిప్ పెంచకుండా రిజిస్ట్రేషన్ చేసుకోబోమని విద్యార్థులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు పాల్గొన్నారు.

టీచర్‌లేక అవస్థలు

చింతకుంటపల్లిలోని అంగన్‌వాడీ చిన్నారులకు తిప్పలు

రెండేళ్లుగా నెట్టుకొస్తున్న ఆయా

ప్రైవేట్‌కు పంపుతున్న తల్లిదండ్రులు

మారుమూల పల్లెల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేసే అంగన్‌వాడీలపట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తున్నదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు పోషణమాసం పేరుతో ప్రచార ఆర్భాటం చేశారేకానీ చిన్నారులకు నాలుగు అక్షరాలు నేర్పించేందుకు అంగన్‌వాడీ కార్యకర్తను నియమించలేకపోయారని పాలకులు, అధికారుల తీరుపట్ల మండిపడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహారం, ఆరోగ్యం, విద్య అందుతుందని ప్రకటనలు గుప్పించడంకాదని, ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలకు టీచర్లను నియమించి చిన్నారుల విద్యా ప్రగతికి బాటలు వేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

- కేశంపేట, జూన్ 21

కేశంపేట మండలం చింతకుంటపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో గత రెండేళ్లుగా టీచర్ లేదని, దీంతో ఆయానే అంగన్‌వాడీ కేంద్రాన్ని నెట్టుకొస్తున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. గతంలో ఇక్కడ పనిచేసిన అంగన్‌వాడీ కార్యకర్త శ్రీదేవికి సూపర్‌వైజర్‌గా ప్రమోషన్ రావడంతో మహేశ్వరం వెళ్లారని, అప్పటి నుంచి అంగన్‌వాడీ కేంద్రంలో టీచర్ పోస్టు ఖాళీగానే ఉందన్నారు. గత రెండేళ్లుగా చింతకుంటపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి టీచర్ లేదనే విషయం అధికారులకు తెలిసినా ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్లుగా ఆయానే కేంద్రాన్ని నెట్టుకొస్తుందంటేనే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని, ఖాళీ స్థానాన్ని భర్తీ చేసే ఉద్దేశం లేనప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో వలంటీర్లను నియమించినట్లు అంగన్‌వాడీ కేంద్రానికి ఓ టీచర్‌ను నియమిస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

తగ్గిన విద్యార్థుల సంఖ్య

చింతకుంటపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రానికి గతంలో 30 మందికి పైగా విద్యార్థులు వచ్చేవారని స్థానికులు చెబుతున్నారు. విద్యా బుద్ధులు నేర్పించేందుకు అంగన్‌వాడీ టీచర్ లేకపోవడంతో ఆ సంఖ్య క్రమంగా 15 మంది చిన్నారులకు పడిపోయినట్లు తెలిపారు. చిన్నారులకు విద్యాపరమైన బోధన జరగకపోవడంతో తల్లిదండ్రులు అంగన్‌వాడీ కేంద్రానికి పంపించేందుకు ఆసక్తి చూపడంలేదని, చేసేదేమీలేక అప్పులు చేసి ప్రైవేట్‌కు పంపుతున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కొత్తగా రిక్రూట్‌మెంట్ చేయకున్నా టీచర్ ట్రైనింగ్ కోర్సు పూర్తి చేసిన వారితో అంగన్‌వాడీ కేంద్రంలో బోధన కొనసాగిస్తే బాగుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

అంగన్‌వాడీకి వచ్చిన ట్రేలో పగిలిన గుడ్డు

పిల్లలకు చదువు చెప్పేవారు లేరు

మా పిల్లలను అంగన్‌వాడీకి పంపిస్తే.. అక్కడ నాలుగు అక్షరాలు నేర్పించేందుకు ఎవరూ లేరు. రెండేళ్లుగా కొత్త టీచర్ వస్తుందని ఎదురు చూస్తూనే ఉన్నా ఎలాంటి ఫలితంలేదు. ఆయా ఒక్కతే అంగన్‌వాడీ కేంద్రాన్ని నెట్టుకొస్తున్నది. టీచర్ లేకపోతే పిల్లలకు చదువు ఎవరు చెబుతారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి అంగన్‌వాడీ టీచర్‌ను నియమిస్తే బాగుంటుంది.

- జిన్నారం స్వప్న, చింతకుంటపల్లి

పాడైన పదార్థాలు వస్తున్నాయి

అంగన్‌వాడీ కేంద్రానికి పాడైన పదార్థాలు ఇస్తుండడంతో తీవ్ర భయాందోళనకు గురవుతున్నాం. కేంద్రంలో తీసుకున్న గుడ్లను ఉడకబెట్టి చూస్తే అందులో సొన మాత్రమే కనబడుతున్నది. ఇలాంటి గుడ్లను పిల్లలకు పెడితే ఆరోగ్యం పాడవదా? పౌష్టికాహారం అందజేస్తున్నామని చెబుతున్న పాలకులు అంగన్‌వాడీలకు వస్తున్న పదార్థాలను తినిపిస్తే ఆ బాధ అర్థమవుతుంది. పిల్లలకు పెట్టే పదార్థాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి.

- పల్లెమోని సంపత్, చింతకుంటపల్లి

ఆదిమానవుడి జీవనశైలిపై అవగాహన

సిటీబ్యూరో, జూన్ 21 (నమస్తే తెలంగాణ) : ఆదిమానవుడి జీవన శైలి,